# ప్రాంగణ ఎంపికలు - కార్పొరేటు కంపెనీల మోసకారితనం

**ఉన్నత,** వృత్తి సాంకేతిక విద్యాసంస్థలలోకి ప్రముఖ కంపెనీలు వచ్చి ప్రాంగణ ఎంపికల పేరిట చివరి సం॥రం విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు అనేక రూపాలలో పరీక్షలు నిర్వహించి, తమకవసరమైన 'మేలి' సరుకుని ఎంపికచేసుకోవటం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతూ వస్తోంది. ప్రాంగణ ఎంపికలలో ఎన్నికైన వారిని తదనంతర కాలంలో వారి కోర్సు పూర్తయిన పిదప ఆయాసంస్థలు కొంతకాలం శిక్షణ గరిపి తమతమ కంపెనీలలో ఉద్యోగావకాశం కల్పించుతూ వుండటంతో, ఉన్నత వృత్తి సాంకేతిక విద్యాసంస్థలలో విద్యాభ్యాసం అయిన వెంటనే ఎంపికైనవారు ఉద్యోగం లభిస్తుందని భావించేవారు. ఏ ప్రైవేటు వృత్తి సాంకేతిక విద్యాసంస్థనుండి ఎక్కువ మంది విద్యార్థులు బహుళజాతి, కార్పొరేటు కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపిక అవుతారో, ఆయా కాలేజీలు దీని ఆసరాతోకూడా తమ కాలేజీ గుర్తింపును పెంచుకోవటం, ప్రచారం అధికంగా చేసుకోవటం, తద్వారా జాతీయ ప్రమాణాల శ్రేణి(నాక్) గుర్తింపులో పైకెగబాకటం, ఆపై తమ కళాశాలలో ఫీజుల పొందికను పెంపుచేసుకుంటూ అధిక లాభాలను దండుకోవటం జరుగుతూ వస్తోంది.

మరో ముఖ్యమైన అంశమేమంటే, ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ వృత్తి, సాంకేతిక కళాశాలల్లో సమానస్థాయి డిగ్రీలు పొందేవారిలో 5 శాతానికి మాత్రమే ఈ కళాశాల ప్రాంగణ ఎంపికలు పరిమిత మవుతుండగా, ఉత్తీర్ణులైన మిగిలిన విద్యార్థుల భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకంగానే వుంది. కార్పొరేట్ల అధీనంలో నున్న మీడియా కూడా ఈ ఆందోళనకరమైన అంశాన్ని వెలుగులోకి తేవటానికి సుముఖంగా లేదు. పైగా, కళాశాల ప్రాంగణాలలో ఎంపిక అయినవారిలో ఏ ఒకరిద్దరికో లక్షలాది రూపాయల వేతనం లభించు తుండటాన్ని ఆకాశానికెత్తి చూపుతోంది. ప్రాంగణ ఎంపికల్లో ఆయా కంపెనీలు ఎంపికచేసుకున్న మిగిలిన విద్యార్థులకైనా, కంపెనీలు మొదట వాగ్దానం చేసిన విధంగా ఉద్యోగాలు, జీతభత్యాలు కల్పిస్తున్నాయా, లేదా అనే అంశంపై దృష్టి సారించటంలేదు.

ముఖ్యంగా వృత్తి, సాంకేతిక విద్యాసంస్థల స్థాపనకు ప్రైవేటు యాజమాన్యాలకు ప్రభుత్వాలు అనుమతులు ఇవ్వటం ప్రారంభమైన తర్వాత, ప్రైవేటు వృత్తి విద్యాసంస్థలలో విద్యనభ్యసించే అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు తిరిగి చెల్లించే విధానం ప్రవేశపెట్టిన తర్వాత – ప్రైవేటు రంగంలో వృత్తి, సాంకేతిక విద్యాసంస్థల స్థాపన లాభసాటి వ్యాపారమైంది. అర్హులైన బోధనా సిబ్బంది, కంప్యూటర్ లాబ్స్, బోధనోపకరణాలు, తదితరాలు ఏవీ లేకున్నా, భవనాలను నిర్మించి, అందులో విద్యార్థులను (కొన్నిచోట్ల ఎదురు డబ్బిచ్చిమరీ) చేర్చుకొని, వారి పేరున ప్రభుత్వ (ప్రజా) ధనాన్ని రీఎంబర్స్‌మెంట్ రూపంలో పొందుతూ ప్రైవేటు, కార్పొరేటు యాజమాన్యాలు లాభాలు గడిస్తున్నాయి. అత్యంత నాసిరకం విద్యాప్రమాణాలతో ఆ సంస్థలలో చేరిన విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నాయి.

ఇలాంటి విద్యాసంస్థలు పోటీలుపడి మరీ కార్పొరేటు, బహుళజాతి సంస్థలను తమ కళాశాలలకు తీసుకువచ్చి, క్యాంపస్ సెలక్షన్లలో ఎక్కువమంది తమ తమ కళాశాలల నుండి ఎంపికయ్యారని ప్రకటించుకోవటంతో, క్యాంపస్ సెలక్షన్లు కూడా బోగస్‌గా మారిపోతున్నాయి.

2015లో ఎల్ అండ్ టి కంపెనీ బి.టెక్ నాల్గవ సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న 4 వేలమంది విద్యార్థులను ప్రాంగణ ఎంపికద్వారా అర్హులైన వారిగా పరిగణించి వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని చెప్పింది. అయితే వారి విద్యాసంవత్సరం పూర్తయి సంవత్సరకాలం గడిచిన తర్వాత కూడా ఆ సంస్థ యాజమాన్యం నుండి ఉద్యోగ నియామకాల గురించి వారికేవిధమైన సమాచారమూ రాలేదు. దీంతో ఆ విధంగా ఎంపికైన విద్యార్థులంతా తమ బిటెక్ కోర్సు పూర్తయిన వెంటనే చెన్నైలోని ఎల్ అండ్ టి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా తర్వాత వీరందరికీ కంపెనీ యాజమాన్యం తిరిగి 'కాండక్టు టెస్టు' పేరిట 2016 ఏప్రిల్‌లో మరో పరీక్ష నిర్వహించింది. ఈ వడపోతతో 1500 మందిని అనర్హులుగా ప్రకటించింది. అనర్హులుగా తిరస్కరించిన ఈ విధానాన్ని వీరు ప్రశ్నిస్తున్నారు. క్యాంపస్ సెలక్షన్స్ సమయంలోనే ఈ కంపెనీల అధికారులు తమను మూడు, నాలుగు రకాలుగా పరీక్షలు నిర్వహించిన తర్వాతనే ఎంపిక చేశారని, తిరిగి ఇప్పుడు తిరస్కరిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఎల్ అండ్ టి కంపెనీ యొక్క ఈ చర్యను నిరసిస్తూ చెన్నైలోనేగాక ముంబయిలోని వారి కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడ్తామని, నిరాహారదీక్షలు చేయనున్నామని బాధిత అభ్యర్థులు పేర్కొన్నారు. ఎల్ అండ్ టి లో ఉద్యోగం వస్తుందన్న ఆశతో సంవత్సరకాలం పైగా తామంతా వేరే ఉద్యోగ ప్రయత్నాలేమీ చేయకుండా వున్నామని వారు వాపోయారు. ఇంత జరుగుతున్నా ఎల్ అండ్ టి కంపెనీకి చెందిన ఏ అధికారీ ఈ అభ్యర్థులతో మాట్లాడటానికి ముందుకు రాకపోవటం, వారి నిరంకుశవైఖరిని స్పష్టంచేస్తోంది.

సాధారణంగా కోర్సు పూర్తయిన పిదప విద్యార్థులంతా వేరువేరు ప్రాంతాలకు వెళ్ళిపోతారు కాబట్టి, వాస్తవంగా క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికయిన వారందరికీ ఉద్యోగ నియామకం జరిగిందా లేదా అనేది బయటకు తెలిసే అవకాశం తక్కువ. వెలుగులోకి వచ్చిన ఇలాంటి ఒకటి, రెండు ఘటనలుకాక, వెలుగులోకి రానివింకెన్నో!

ooooo